క్లుప్తంగా

నేడు అయోధ్యస్వామి ఆరాధన మహోత్సవం



పెదకూరపాడు: మండల పరిధిలోని 75 త్యాళ్లూరు గ్రామంలో ఈ నెల 25న అవధూత అయోధ్యస్వామి 20వ ఆరాధన మహోత్సవం పురస్కరించుకుని గురువారం ఆధ్యాత్మిక గురువులచే ఓం సాయినాథ జై అయోధ్యస్వామి జై అంటూ ఏకాహం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 25న తెల్లవారుజామున వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ 75 త్యాళ్లూరు పురవీధుల్లో నగర సంకీర్తన అనంతరం వేద బ్రాహ్మణులచే గణపతి పూజతో ప్రారంభమై అయోధ్యస్వామి విగ్రహానికి పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలతో ప్రత్యేక పూజలు, విశేషాలంకరణ అనంతరం ఆధ్యాత్మిక గురువులు అయోధ్యస్వామి జీవిత చరిత్ర సత్సంగం జరగనున్నాయి. భక్తులకు తీర్థప్రసాదలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ కమిటీ నిర్వాహకులు తాటి కోటేశ్వరమ్మ, రామకృష్ణ తెలిపారు. అయోధ్యస్వామి ఆరాధన కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

నకరికల్లు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 26న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.కాశయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉదయం 11 గంటలకు విధిగా హాజరుకావాలని సూచించారు.

ఘనంగా చౌడేశ్వరీ అమ్మవారి పుట్టినరోజు వేడుకలు



నకరికల్లు: మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో వేంచేసి ఉన్న చౌడేశ్వరీ అమ్మవారి పుట్టినరోజు వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు అరిపిరాల సూర్య ప్రకాశ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లతో విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. పలువురు మహిళా భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, సారెను సమర్పించారు. శాకంబరీదేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. భక్త సంఘం ఆధ్వర్యంలో ఆలయంలోని మండపంలో మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీలకు శంకుస్థాపన

సత్తెనపల్లి: పట్టణంలోని 3వ వార్డులో రూ.12.03 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీలకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం పట్టణంలోని 3వ వార్డులో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రూ.16.40 లక్షలతో ఆధునీకరణ చేసిన వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభించారు. వార్డులో సమస్యలను అడిగి తెలుసుకుని మై టీడీపీ యాప్‌లో నమోదు చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని త్వరలోనే కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పొలం గట్ల వివాదంపై కేసు నమోదు

ముప్పాళ్ళ: పొలం గట్ల వివాదంపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.సోమేశ్వరరావు గురువారం తెలిపారు. నరసరావుపేట మండలంలోని ములకలూరుకు చెందిన చింతా ఆంజనేయులు, అతని సోదరి చెన్నంశెట్టి చంద్రికలకు ముప్పాళ్ళ మండలంలోని గోళ్ళపాడు గ్రామ రెవెన్యూ పరిధిలో కొంత వ్యవసాయ భూమి కలదు. గత కొంతకాలం నుంచి ఆంజనేయులు, అతని భార్య సునీత తనకు కట్నంగా ఇచ్చిన పొలం హద్దు రాళ్లను తరచూ పీకివేస్తూ ఇబ్బందులు పెడుతున్నారంటూ ఆంజనేయులు సోదరి చెన్నంశెట్టి చంద్రిక ముప్పాళ్ళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. చంద్రిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు మంత్రి జనార్ధన్‌రెడ్డి సత్తెనపల్లి రాక

సత్తెనపల్లి: నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి శుక్రవారం సత్తెనపల్లి రానున్నారని ఆ పార్టీ నాయకులు గురువారం తెలిపారు. స్థానిక శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణతో కలిసి పట్టణంలో రూ.75 లక్షలతో నిర్మించిన ఉప ఖజానా కార్యాలయ భవనం, రూ.3 కోట్లతో నిర్మించిన ఆర్ అండ్ బీ అతిథి గృహం ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.



రోడ్డు మధ్యలో గుంత.. ప్రమాదాలు చెంత..

మండలంలోని 75త్యాళ్ళూరు ప్రధాన రహదారిపై పెద్ద గుంత ఏర్పడి ప్రమాదంగా మారింది. నిత్యం వందలాది మంది ప్రయాణికులు నిత్యం ఈ రహదారిపై ప్రయాణిస్తున్నారు. ఎదురుగా వాహనాలు వచ్చే సమయంలో గుంతలో ద్విచక్ర వాహనాలు పడి ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయంలో గుంత కనిపించక ప్రయాణికులు ప్రమాదాల పాలవుతున్నారు. అంతేకాక వర్షాలకు గుంతలో నీళ్లు నిలబడి లోతు తెలియక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి గుంతను పూడ్చి ప్రమాదాల నుంచి రక్షించాలని ప్రయాణికులు వేడుకుంటున్నారు.

– పెదకూరపాడు



ప్రమాదంగా భవనం.. కూలడం ఖాయం..

పురాతన ప్రభుత్వ కార్యాలయాల భవనాలు ప్రమాదకరంగా మారాయి. పట్టణంలోని ఏపీ ప్రభుత్వ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఉప కార్యపాలక ఇంజనీర్ వారి కార్యాలయం ప్రాజెక్ట్ సబ్ డివిజన్ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో భవనం గోడకు పెద్ద చెట్లు మొలిచాయి. గోడలో నుంచి చెట్లు వేళ్లు బయటకు వచ్చి గోడలకు నెర్రెలు సైతం వచ్చాయి. ప్రస్తుతం పెద్ద వర్షం పడితే ఇలాంటి భవనాలు కూలడం ఖాయం. అది రోడ్డు పక్కనే ఉండటంతో పాదచారులు, వాహనదారులకు ప్రమాదం జరిగే ఆస్కారం ఉంది.

– సత్తెనపల్లి

వర్షాకాలం.. పొంచి ఉన్న ప్రమాదం

రైతులు పొలాల్లో అలక్ష్యంగా ఉంటే విష సర్పాల బారిన పడే అవకాశం

- అన్ని సర్పాలు విషపూరితం కాదంటున్న వైద్యులు
- సకాలంలో ఆసుపత్రికి చేర్చితే మేలు

బెల్లంకొండ: వర్షాకాలం ప్రారంభం కావడంతో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇదే సమయంలో పాముల బెడద కూడా ఎక్కువగా ఉంటుంది. ఏమాత్రం అలక్ష్యంగా ఉన్న పాము కాటుకు గురికాక తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం వాతావరణం చల్లబడంతో సర్పాలు బయటకు వస్తాయి. అలా వచ్చిన సర్పాలు పొలాల్లోని రైతులు, పనిచేసే వారిని కాటేసే ప్రమాదం ఉంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

ఆందోళన చెందకూడదు

రైతులు పొలం పనులకు వెళ్లే సమయం ఇదే.. ఆహార అన్వేషణలో పాములు పొలం గట్లు, పొదల వెంట రాత్రిపూట ఎక్కువగా సంచరిస్తుంటాయి. రైతులు రాత్రివేళ పొలాలకు వెళ్లేటప్పుడు చెప్పులు, టార్చ్ లైట్, శబ్దం చేసే పరికరాలు వెంట తీసుకొని వెళ్లడం మంచిది. ఒకవేళ పాము కాటుకు గురైతే ఎలాంటి ఆందోళన చెందకూడదు. ఒత్తిడికి గురైతే బీపీ పెరగడంతో పాటు గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది. పాము కాటు వేయగానే పైభాగం గుడ్డతో కట్టి, కాటు వేసిన భాగాన్ని కొత్త బ్లేడుతో గాటు వేసి రక్తాన్ని నోటితో లాగేయాలి. ప్రాథమిక వైద్యం అందించిన వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లాలి.

అవగాహన అవసరం

రైతులకు పాములపై కనీస అవగాహన ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. కనిపించే పాములన్నీ విషపూరితం కాదని, విష సర్పాలు రెండు రకాలుగా ఉంటాయని చెబుతున్నారు.

మొదటిది న్యూరో టాక్సిక్ రకం.. అవి నాగుపాము, కట్లపాము. ఇవి కాటు వేస్తే మనిషికి నోటి ద్వారా నురుగు వచ్చి శ్వాస ఆడక మృతి చెందే ప్రమాదం ఉంది. ఇది గుండెపై ప్రభావం చూపే నాడీ వ్యవస్థను దెబ్బతీస్తుంది. రెండవ రకం హీమోటాక్సిన్.. రక్తపింజర పాము వంటివి ఈ కోవకు వస్తాయి. హిమోటాక్సిన్‌తో రక్తనాళాలు కణాల్లో కణజాలం నశించి కాటు వేసిన భాగంలో వాపు వస్తుంది. కాటు వేసిన పాము ఎలాంటిదో తెలిస్తే చికిత్స చాలా సులభం. పక్క పక్కన రెండు దంతాలు కాటు వేస్తే అది కచ్చితంగా విష సర్పమే. ఎటువంటి పాము కాటు వేసిన ఆసుపత్రికి వెళితే తీవ్రతను బట్టి యాంటీవీనం, యాంటీ పాలి వీనం అనే రెండు రకాల మందులు ఉంటాయి.



వైద్యశాలలో అందుబాటులో ఉన్న యాంటీవీనమ్ ఇంజక్షన్‌లు

నాటు వైద్యం చేయకూడదు



పాము కాటుకు సంబంధించి యాంటీ స్నేక్ వీనం ఇంజక్షన్ అందుబాటులో ఉంది. వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలి. పాము కాటుకు గురైన వారిని నేరుగా ఆసుపత్రికి తరలించాలి. మూఢ నమ్మకాలతో సమయం వృధా చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోకూడదు. పాము కరిచిన వెంటనే నాటు వైద్యం చేయకుండా దగ్గర్లోని ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలి.

– డా.దీపిక, పీహెచ్‌సీ వైద్యాధికారి, చంద్రాజుపాలెం, బెల్లంకొండ మండలం

జీవన ఎరువుల వాడకంతో పర్యావరణ పరిరక్షణ

జిల్లా వనరుల కేంద్రం ఏవో అరుణ



మాట్లాడుతున్న ఏవో అరుణ

అచ్చంపేట: పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించుకోవడానికి జీవన ఎరువులు ఎక్కువగా వాడాలని, ఫాస్ఫో బాక్టర్, అజటోబాక్టర్ లాంటి జీవన ఎరువులు వాడాలని జిల్లా వనరుల కేంద్రం ఏవో అరుణ తెలిపారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో గురువారం జరిగిన రైతుల శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పంట మార్పిడి విధానంతో ఎక్కువ ఫలసాయాన్ని పొందవచ్చన్నారు. బీమా కంపెనీ ప్రతినిధి నింగయ్య మాట్లాడుతూ మిరప పంటకు ఎకరాకు రూ.360 ప్రీమియం చెల్లించి బీమా చేసుకోవాలని, ఈ నెలాఖరు వారకు గడువు ఉందన్నారు. పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ కొప్పురావూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ యూరియా, డీఏపీ వాడకం పెంచాలన్నారు. ఏవో పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పంట సాగు చేసే ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని, అలా చేయించుకున్న వారికే ప్రభుత్వ పంట రాయితీలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎండీఎస్ సాగులో పంట కోత ప్రయోగం



చల్లగుండ్లలో పంట కోత ప్రయోగంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ శిక్షకుడు సైదయ్య తదితరులు

నకరికల్లు: పీఎండీఎస్ పద్ధతిలో 30 రకాల విత్తనాలను పంట వేసే ముందుగా సాగు చేయడం ద్వారా ప్రధాన పంటలో పెట్టుబడి ఖర్చును తగ్గించుకోవచ్చని పల్నాడు జిల్లా ప్రకృతి వ్యవసాయ శిక్షకుడు సైదయ్య తెలిపారు. మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో పీఎండీఎస్ విత్తనాలను సాగు చేస్తున్న పొలాలను గురువారం పరిశీలించి పంటకోత ప్రయోగం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, సుగంధద్రవ్యాలు, పచ్చిరొట్ట విత్తనాలు, ఆకుకూరలు, కూరగాయలు, తీగ, దుంపజాతి తదితర 30 రకాల విత్తనాలను ప్రధాన పంటకు ముందుగా సాగు చేయాలన్నారు. తద్వారా దిబ్బ ఎరువుల కోసం పెట్టే పెట్టుబడి, రసాయనిక ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చని తెలిపారు. చీడపీడలు తట్టుకునే శక్తి పంటలకు పెరుగుతుందన్నారు. పీఎండీఎస్ సాగు చేసిన పొలంలో 5 మీటర్ల వైశాల్యంతో పంటకోత ప్రయోగం చేయగా 77.800 కిలోల దిగుబడి వచ్చిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అప్పలరాజు, నందకుమార్, పిడుగురాళ్ల డివిజన్ మాస్టర్ ట్రైనర్ బాజీబాబు, యూనిట్ ఇన్‌చార్జిలు రేణుక, రామసుబ్బారెడ్డి, రత్నకుమారి, ప్రకృతి వ్యవసాయ మహిళా రైతు చింతలచెరువు వెంకటరమణ, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

యువత గుర్రం జాషువాను స్ఫూర్తిగా తీసుకోవాలి

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సుధీర్‌భార్గవ్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ గజ్జల, నాయకులు

సత్తెనపల్లి: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువాను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయం, రైల్వే స్టేషన్ రోడ్‌లోని గుర్రం జాషువా విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చిలుకా జైపాల్ ఆధ్వర్యంలో గురువారం జాషువా వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గజ్జల మాట్లాడుతూ తన పదునైన కవిత్వం ద్వారా సమాజంలోని దురాచారాలను ప్రశ్నించిన మహాకవి గుర్రం జాషువా అని కొనియాడారు. జాషువా రచనలకు పద్మభూషణ్, కళా ప్రపూర్ణ, కవికోకిల, నవయుగ కవి చక్రవర్తి వంటి బిరుదులు, సాహిత్య అకాడమీ పురస్కారం లభించాయని తెలిపారు. ముందుగా గుర్రం జాషువా చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాలల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు చలంచర్ల సాంబశివరావు, షేక్ మౌలాలి, సంకటి శ్యామ్‌సన్, గుజ్జర్లపూడి సతీష్, పెద్దింటి వెంకటేశ్వర్లు, అచ్యుత శివప్రసాద్, షేక్ నాగుల్‌బాషా, షేక్ జలీల్ తుమ్మల వెంకటేశ్వరరావు, షేక్ జానీ, బండి మల్లికార్జున్‌రెడ్డి, ఇసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చిలుక రమణయ్య, షేక్ మహ్మద్ గని, వల్లెం నరసింహారావు, సిరిగిరి వెంకట్రావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సామాజిక చైతన్య కెరటం జాషువా

పెదకూరపాడు: తన రచనల ద్వారా కుల, సామాజిక, ఆర్థిక వివక్షపై యుద్ధం ప్రకటించిన సామాజిక చైతన్య కెరటం గుర్రం జాషువా అని ప్రజాకవి పీడీఎఫ్ కన్వీనర్ దర్శి శేషారావు అన్నారు. గురువారం కవి కోకిల, నవయుగ కవి చక్రవర్తి, పద్మభూషణ్ గుర్రం జాషువా వర్ధంతిని పెదకూరపాడు కచేరి సెంటర్‌లో నిర్వహించారు. మాజీ యార్డ్ ఛైర్మన్ బెల్లంకొండ రాంగోపాలరావు మాట్లాడుతూ గుర్రం జాషువా అపారమైన జ్ఞానంతో, సార్వత్రిక దృక్పథంతో రచించారన్నారు. తన జీవితాంతం సామాజిక న్యాయం కోసం అసమానతలు లేని సమాజం కోసం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో వేదుల రామనామం, సంజీవరావు, ఎం.నరసింహారావు, శ్రీనివాసరావు, ఆఫీస్ అలీ, వేణు తదితరులు పాల్గొన్నారు.

27న అనంతవరంలో ఉచిత మెగా వైద్య శిబిరం



అనంతవరం(క్రోసూరు): మండలంలోని అనంతవరం గ్రామం ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ఈ నెల 27వ తేదీన గుంటూరు విజయశ్రీ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులచే ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సహృదయ సేవా సంస్థ అధ్యక్షుడు పట్టేల శ్రీనివాసరావు గురువారం తెలిపారు. అన్ని రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో రూ.2,500 విలువ గల ఎముకల సాంద్రత తెలియజేసే పరీక్ష పూర్తిగా ఉచితమని తెలిపారు. ఈ సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరం వాల్‌పోస్టర్‌ను గుంటూరులో సినీ నటుడు సుమన్ చేత ఆవిష్కరింపచేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి డాక్టర్ ప్రసన్నకుమార్, ఈడే మురళి, సమ్మెట కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు నివాళి



జాషువా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, నాయకులు

సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో గల నవయుగ కవి చక్రవర్తి, పద్మభూషణ్ గుర్రం జాషువా వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుర్రం జాషువా సాహిత్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీఎస్ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ దరువూరి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పొట్టకూటి కోసం వెళ్తూ ప్రమాదం



శివయ్య



వీరాంజనేయులు

పెదకూరపాడు : పొట్టకూటి కోసం వెళుతూ ఇరువురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని చినమక్కెన గ్రామం వద్ద గురువారం చోటు చేసుకుంది. తోటి ప్రయాణికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నకరికల్లుకు చెందిన కూలీలు అమరావతి మండలంలోని కోళ్ల ఫారం వద్ద కోళ్ల వ్యర్థాలను లోడ్ చేసే పనికి టాటా ఏస్ వాహనంలో బయలుదేరారు. పిండి వీరాంజనేయులు, శివయ్య టాటా ఏస్ వెనుక భాగంలోని డోరు మీద కూర్చున్నారు. చినమక్కెన గ్రామ సమీపంలో డోర్‌కు తగిలించిన గొలుసులు ఒక్కసారిగా తెగిపడి ఇరువురు రోడ్డుపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. తోటి ప్రయాణికులు గమనించి కేకలు వేయడంతో అదే వాహనంలో పెదకూరపాడు సీహెచ్‌సీకి తరలించారు. వీరాంజనేయులకు చేతికి గాయమవగా, శివయ్య తలకు తీవ్ర గాయమైంది. వైద్యుల సూచన మేరకు 108 వాహనంలో శివయ్యను మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య

వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సుధీర్‌భార్గవ్‌రెడ్డి



మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల

రాజుపాలెం: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను సక్రమంగా అమలు చేయడం చేతకాక మరలా ప్రజలను మోసం చేస్తూ సుపరిపాలనలో తొలి అడుగని టీడీపీ నాయకులు ఇంటింటా తిరగడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మండల కేంద్రంలోని కల్యాణ మండపంలో మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు అధ్యక్షతన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేస్తున్న మోసాలను వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ప్రజల దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏడాది కాలంలో వైఎస్సార్ సానుభూతి పరులపై కేసులు పెట్టడం, వేధించడం తప్ప వారు చేసిందేమి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని ఇంటింటికి వెళ్లి ఊదరగొట్టారని, అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాల్సిందేనని అంటున్నారని ఎద్దేవా చేశారు. జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. అనంతరం చంద్రబాబు ఇచ్చిన హామీలు, చేసిన మోసాలను అంకెలతో సహా వీడియో రూపంలో వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి ఎస్కే బాషా, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ బూదాటి సీతారాములు, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ ఎస్కే జానీ, మండల మైనార్టీ సెల్ కన్వీనర్ ఎస్కే సుభాని, పాలువాయి ఆదినారాయణ, మాజీ ఎంపీపీ వేల్పుల వెంకటేశ్వర్లు, యువజన నాయకులు బత్తుల శివయ్య, జంగం నరసింహారావు, చెవుల స్వామి పాల్గొన్నారు.

అధైర్య పడవద్దు... పార్టీ అండగా ఉంటుంది

సత్తెనపల్లి: అధైర్య పడవద్దని.. ప్రతి ఒక్కరికి వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుందని వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి అన్నారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్ళ గ్రామంలో టీడీపీ సానుభూతిపరుల దాడిలో గాయపడి ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వల్లెపు రాంబాబు, వల్లెపు రవితేజ, వల్లెపు వీరయ్యలను గురువారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగులో భాగంగా పెరుగుతున్న మిర్చి నారుమడుల్లోకి గొర్రెల మంద వెళ్లడంతో దానిపై ప్రశ్నించిన నేపథ్యంలో దాడులు జరిగాయన్నారు. ఈ దాడిని ఆయన పూర్తిగా ఖండించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని వారికి ధైర్యం, భరోసా కల్పించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కొర్లకుంట వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బెల్లంకొండ: బాల్య వివాహాల పట్ల విద్యార్థులు చిన్నతనం నుంచే అవగాహన కలిగి ఉండాలని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని చంద్రాజుపాలెంలోని జెడ్పీ హైస్కూల్లో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆడపిల్లలకు 18, మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండకుండా వివాహం చేయకూడదన్నారు. తక్కువ వయసులో వివాహం చేయడం వలన ఆడపిల్లలలో శారీరక, మానసిక ఎదుగుదల లోపించి ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. చిన్న వయసులో గర్భం దాల్చడం వల్ల పుట్టే పిల్లలకు శారీరక వైకల్యం, ఎదుగుదల లేకపోవడం వంటి సమస్యలు వస్తాయన్నారు. స్థానిక ఎస్ఐ డి.ప్రవీణ్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. మత్తు పదార్థాలు, డ్రగ్స్ వలన కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను ప్రభుత్వం తీసుకురావాలి

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వేణుగోపాల్



సత్తెనపల్లి: న్యాయవాదులపై భౌతిక దాడులు, వేధింపులు నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో ఏపీ అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సత్తెనపల్లి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నరిశెటి వేణుగోపాల్ కోరారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ న్యాయవాదులపై రోజురోజుకూ భౌతికదాడులు, బెదిరింపులు, హత్యాయత్నాలు పెరుగుతుండడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం చేయడంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం పట్ల న్యాయవాదులలో అసంతృప్తి నెలకొందన్నారు. శిథిలావస్థకు చేరుకున్న పాత కోర్టుల స్థానంలో నూతన కోర్టు భవనాలు నిర్మించాలన్నారు. సత్తెనపల్లిలో 'నూతన కోర్టు కాంప్లెక్స్' నిర్మాణ అనుమతులు, నిధులు మంజూరు చేసి తక్షణమే పనులు ప్రారంభించాలన్నారు. ఆ భవనంలోనే సత్తెనపల్లి బార్ అసోసియేషన్‌లో మెంబర్ అయిన ప్రతి న్యాయవాదికి చాంబర్ మంజూరు చేయాలన్నారు. అడ్వకేట్ కాలనీ ఏర్పాటు చేసి న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. అడ్వకేట్ డెత్ బెనిఫిట్స్ రూ.10 లక్షలకు పెంచాలని, జూనియర్ అడ్వకేట్‌లకు నెలకు రూ.10 వేలు స్టైపెండ్ ఇవ్వాలన్నారు. మహిళా న్యాయవాదులకు ప్రతి కోర్టులో వెయిటింగ్ రూంలు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా హైకోర్టు నుంచి దిగువ కోర్టుల వరకు ఉన్న జడ్జిల, కోర్టు సిబ్బంది పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. న్యాయవాదుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఐఏఎల్ ప్రతినిధుల బృందం రాష్ట్ర ముఖ్యమంత్రి, న్యాయశాఖ మంత్రి, హోం మంత్రి, డీజీపీలకు అందజేయనున్నట్లు వేణుగోపాల్ తెలిపారు.

మేలైన సాగు పద్ధతులపై రైతులకు శిక్షణ



మాట్లాడుతున్న పల్నాడు జిల్లా డీడీఏ ఎం.శివకుమారి

క్రోసూరు: క్రోసూరులోని రైతు సేవా కేంద్రం–1లో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ శాఖ డీడీఏ ఎం.శివకుమారి హాజరై మాట్లాడుతూ రైతులకు వివిధ పంటల్లో మేలైన సాగు పద్ధతులు, సస్యరక్షణ చర్యలను వివరించారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేయవలసిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో క్రోసూరు ఏడీఏ మస్తాన్మ మాట్లాడుతూ రైతులు అధికారుల సూచనల పాటిస్తూ పంటలను పండించాలని అప్పుడే తక్కువ ఖర్చుతో, నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ జిల్లా మేనేజర్ నింగయ్య మాట్లాడుతూ పత్తి, కంది, మిర్చి పంటలకు జూలై 31వ తేదీ వరకు, వరి పంటకు ఆగస్టు 15వ తేదీ గడువుగా ఉందని, ఈ లోపు సీఎస్‌సీలో ప్రీమియం చెల్లించి పంటల బీమా పథకంలో చేరాలని కోరారు. మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ కౌలు రైతులు తప్పనిసరిగా సీసీఆర్సీ కార్డులు రైతు సేవా కేంద్ర సిబ్బందిని గానీ, గ్రామ రెవెన్యూ అధికారిని గానీ సంప్రదించి పొందాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది కె.వెంకట శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

ప్రతిభకు పేదరికం అడ్డు కారాదు

సత్తెనపల్లి: సమాజంలో ప్రతిభకు పేదరికం అడ్డు కారాదని ప్రముఖ యోగ గురువు రమేష్ అన్నారు. మండలంలోని వెన్నాదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన కొనసదేవి శ్రీసాహితి 565 మార్కులతో ప్రథమ స్థానం సాధించింది. సాహితీ తండ్రి వెంకటేశ్వరావు13 ఏళ్ల క్రితం ప్రమాదంలో మృతి చెందగా తల్లి లక్ష్మి కూలి పనులు చేస్తూ ఇద్దరు కుమార్తెలను చదివిస్తోంది. దీంతో సాహితి ఉన్నత విద్యాభ్యాసానికి సత్తెనపల్లికి చెందిన తెళ్ళ వెంకటేశ్వరరావు గురువారం రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించారు. సాహితి ఉన్నత చదువుల్లో ప్రతిభను కనబరిస్తే విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు అండగా ఉంటానని వెంకటేశ్వరావు చెప్పారు. యోగ శిక్షణ శిబిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మాదంశెట్టి వేదాద్రి, దనేకుల సాంబశివరావు ఉన్నారు.